

పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

పోలవరం : ఉద్యోగ పరంగానే కాకుండా ప్రజలకు విద్య, వైద్యం వంటి అవసరమైన సేవలను అందించి పోలీసులు స్నేహభావంతో ఉంటారని పోలవరం డిఎస్పి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన మదర్ మల్టీ స్పెషాలిటీ వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ప్రజలతో స్నేహంగా ఉండడానికి సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పి ప్రతాప్ శివకిషోర్ సూచనల మేరకు వైద్య శిబిరం ద్వారా వైద్య సేవలందిస్తున్నా మన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు మంచి వైద్యం అందించి, వారి ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడడానికి వైద్య శిబిరం దోహదం చేస్తుందన్నారు. పోలీసులకు, ప్రజలకు మధ్య స్నేహ భావం పెంపొందడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫ్రెండ్లీ పోలీసులో భాగంగా పోలీసులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వాటి సంగతి మరిచారా..!

శిథిలావస్థలో స్లూయిస్‌లు, లాకులు, షట్టర్లు



శిథిలావస్థకు చేరిన ఏలూరుపాడు లాకు

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లాలో ఇరిగేషన్ వ్యవస్థలో కీలకమైన లాకులు, వియర్లు, రెగ్యులేటర్‌లు దాదాపు 160 ఏళ్ల కిందట ఏర్పాటు చేసినవి. వీటి నిర్వహణపై దశాబ్దాలుగా నిర్లక్ష్యం నెలకొన్న సంగతి అందరికీ తెలిసిందే. డెల్టా ఆధునికీకరణ పనుల్లో వీటిని మారుస్తారని ప్రకటించినా ఆచరణలో ఆ పనులకు నిధుల కేటాయింపు ఊసే లేని పరిస్థితి. దీంతో ఆయా లాకులు, షట్టర్ల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. ప్రభుత్వాలు మారుతున్నా చేతలు మాత్రం మారడం లేదు. కేవలం వేసవి ముగింపు ముందు హడావుడిగా ఒఅండ్ఎం పనులు నిర్వహించేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ హయాంలో కాలువల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేయడంతో అధ్వానంగా మారాయి. కాలువలు పూడుకుపోయి, షట్టర్లు తుప్పుపట్టిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పూడిక తొలగింపు పనులు కొన్నిచోట్ల ప్రారంభమయ్యాయి. పాడైన షట్టర్లను నీరు విడుదల కాకముందే అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భద్రత కరువు.. నీటి వృథా

డెల్టాలో ప్రధాన పంట కాలువలపై లాకుల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. వీటిలో నరసాపురం జిఅండ్‌వి కెనాల్‌పై ఆరేసి చొప్పున లాకులు, విఎండబ్ల్యు, బ్యాంక్ కాలువలపై మూడేసి, ఉండి, అత్తిలి, కాకరపర్రు కాలువలపై రెండేసి, జంక్షన్ కాలువపై ఒక లాకు ఉన్నాయి. ఎక్కువ శాతం లాకుల తలుపులు దెబ్బతిని నీరు వృథాగా పోతుంది. అత్యవసర వేళల్లో నీటిని డ్రెయిన్లలోకి మళ్లించిన చోట్ల ఉన్న వియ్యర్, షట్టర్లు పలుచోట్ల దెబ్బతిన్నాయి. లాకుల కట్టడాలు శిథిలావస్థకు చేరాయి. పశ్చిమ డెల్టాలో సుమారు ఏడు కాలువల నుంచి విడిపోయే కాల్వల స్లూయిస్‌లు, షట్టర్లు దెబ్బతినడం గమనార్హం.



మొండి సమీపంలో తుప్పుపట్టి పాడైన షట్టరు

శిథిలావస్థలో ఏలూరుపాడు లాకులు

డెల్టాలో పరిమెళ్ల లాకు నుంచి ప్రారంభమైన వెంకయ్య వయ్యేరు కాల్వ ఏలూరుపాడు లాకుల వద్ద ముగుస్తుంది. ఏలూరుపాడు లాకుల నుంచి ఉప్పుటేరులో కలుస్తుంది. ఒకప్పుడు ఈ లాకుల మార్గం నుండి సరుకు రవాణా జరిగేది. మచిలీపట్నం వెళ్లేందుకు ఈ మార్గాన్ని ఉపయోగించేవారు. ప్రస్తుతం లాకు, వియ్యర్ శిథిలావస్థకు చేరాయి. నిడమర్రు, గణపవరం, ఆకివీడు, కాళ్ల మండలాల్లోని 40 వేల ఎకరాల ఆయకట్టుకు వెంకయ్యావయ్యేరు నీరే ప్రధానం. వీటిని పట్టించుకునే నాథుడే లేరు. ఉండి నియోజకవర్గంలో ప్రధాన కాలువల్లో 23 స్లూయిస్‌లు ఉన్నాయి. తుప్పు పట్టి పాడైన షట్టరు, స్లూయిస్‌లు శిథిలావస్థకు చేరాయి.

సాగునీటి వ్యవస్థను మెరుగుపరచాలి



అంకాని రంగబాబు, రైతు, ఏలూరుపాడు

బ్రిటీష్ కాలం నాటి ఇరిగేషన్ వ్యవస్థే కొనసాగుతోంది. అధ్వానంగా ఉన్న వ్యవస్థను మెరుగుపరచడంలో పాలకులు విఫలమవుతున్నారు. స్లూయిస్‌లు, లాకులు, షట్టర్లు బాగు చేయించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. కాల్వల ద్వారా నీటిని వదిలే సమయానికి వాటికి కనీసం మరమ్మతులు చేపట్టాలి.

పనులు జరిగేలా కృషి చేస్తా

పిఎన్‌వివి.సత్యనారాయణమూర్తి, ఇరిగేషన్ డిఇ

గతంలో మంజూరైన నిధులతో పంట కాలువల్లో పూడికతీత పనులు కొన్నిచోట్ల జరుగుతున్నాయి. పంట కాలువల్లో స్లూయిస్‌లు, షట్టర్లు, లాకుల మరమ్మతులకు ఒఅండ్ఎం నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. ఉండి సబ్ డివిజన్ పరిధిలో ఉంగుటూరు నియోజకవర్గంలో రూ.3.18 కోట్ల అంచనా వ్యయంతో 48 పనులను, ఉండి నియోజకవర్గంలో రూ.3.40 కోట్ల అంచనా వ్యయంతో 81 పనులను, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రూ.3.23 కోట్ల అంచనా వ్యయంతో 13 పనులు, భీమవరం నియోజకవర్గంలో రూ.40 లక్షలు అంచనా వ్యయంతో 11 పనులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరైతే పనులు చేపడతాం. జూన్ మొదటి వారంలో కాలువలకు నీటిని విడుదల చేస్తాం.

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాల్సిందే

లేనిపక్షంలో 17 నుంచి కంపెనీల గొడౌన్ల వద్ద రైతుల రిలే నిరాహార దీక్షలు

మద్దతు పలికిన రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్


ప్రజాశక్తి - ఏలూరు సిటీ , దెందులూరు

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాల్సిందేనని, లేనిపక్షంలో ఈ నెల 17 నుంచి కంపెనీలు, గొడౌన్ల ముందు రిలే నిరాహారదీక్షలు చేప డతామని కోకో రైతులు స్పష్టం చేశారు. గురువారం ఏలూరు సమీపంలోని సోమ వరప్పాడు జాతీయ రహదారి వద్ద మోండలీజ్ కంపెనీ ఆఫీసు, గొడౌన్ వద్ద ఎపి కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. కోకో గింజల ధర తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాకు రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోకో గింజలు ఉత్పత్తి చేయాలంటే రైతు ఎంతో కష్టపడాల్సి వస్తుందన్నారు. రైతును గౌరవించాల్సిందిపోయి కంపెనీలు అవమానించడం దారుణమని విమర్శించారు. ధర విషయంలో కోకో గింజల కొనుగోలు కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్పొరేట్ కంపెనీలకు దీటుగా సహకార వ్యవస్థను అభివృద్ధి చేయాలని, అందుకు రైతులు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పిఒ)లుగా ఏర్పడాలని సూచించారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రోజురోజుకీ ధర ఎందుకు తగ్గిస్తున్నారో, రైతుల నుండి కోకో గింజలు ఎందుకు కొనుగోలు చేయడం లేదో చెప్పాలన్నారు. కోకో రైతులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కంపెనీ దిగిరాకపోతే కంపెనీ కార్యకలాపాలు స్తంభింపజేయడానికి వెనుకాడేది లేదన్నారు. కోకో రైతుల సమస్యపై ప్రభాకర్ వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడిని ఫోన్లో సంప్రదించారు. రెండు, మూడు రోజుల్లో కంపెనీలు, రైతులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ రెండున్నర నెలలుగా కోకో రైతులు పెద్దఎత్తున పోరాటం చేస్తున్నా కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ధరలు తగ్గించి రైతులను మోసగించడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోకో రైతులను ఆదుకోవాలని, కార్పొరేట్ కంపెనీల మోసాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజల ధర పెరుగుతున్నా దేశీయంగా ధరలు ఎందుకు తగ్గిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కంపెనీలు



మహాధర్నాలో నినదిస్తున్న కోకో రైతులు, నేతలు

డిమాండ్ లేదని అబద్ధాలు చెబుతూ రైతులను మోసగిస్తున్నాయని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కిలోకు రూ.800 ధర ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన కోకో గింజలకు వ్యత్యాసపు ధర చెల్లించాలన్నారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు సింహాద్రి గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, బోళ్ల వెంకట సుబ్బారావు, ఉప్పుగంటి భాస్కరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఉప్పల కాశీ, గుదిబండి వీరారెడ్డి, కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్ తదితరులు మాట్లాడుతూ కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారిందన్నారు. కంపెనీలు తీరు మార్చుకోకుండా ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



సంఘీభావం తెలిపిన రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు, ఎంఎల్ఎ చింతనేమని

కంపెనీ ప్రతినిధులతో చర్చలు

ధర్నా శిబిరం వద్దకు మోండలీజ్ కంపెనీ మేనేజర్ రాజేష్ రామచంద్రన్ వచ్చి రిటైర్డ్ డిజిపి ఎ.బి.వెంకటేశ్వరరావు, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సమక్షంలో చర్చలు జరిపారు. రైతులు వద్దనున్న గింజలు కొనుగోలు చేస్తామని, రైతులకు క్షమాపణ చెబుతున్నామని, అయితే ధర పెంచలేమని మేనేజర్ చెప్పడంతో చర్చలు అసంపూర్ణంగా ముగిశాయి.

24 గంటల్లో సమాధానం చెప్పకపోతే ఉద్యమం తీవ్రతరం

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చేలా కంపెనీలు తగిన నిర్ణయం ప్రకటించకపోతే అన్ని కంపెనీల గొడౌన్ల ఈ నెల 17 నుంచి రిలే నిరాహారదీక్షలు చేపడతామని, కంపెనీల కార్యకలాపాలు స్తంభింపజేస్తామని కోకోరైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి కోకో రైతుసంఘం రాష్ట్ర నాయకులు కోనేరు సతీష్‌బాబు, పి.నరసింహారావు, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, మాజీ జెడ్‌పిటిసి సాగర్, పర్వతనేని బాబ్జి, మాధవరావు, ఎవి.రావు, ఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఏలూరు జిల్లాతోపాటు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల నుండి పెద్దసంఖ్యలో కోకో రైతులు తరలొచ్చారు.

సమీకృత సాగుతో రైతులకు అధిక లాభాలు

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఉంగుటూరు

సమీకృత సాగు (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం)లో సేంద్రియ ఎరువులతో సాగుచేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వనుందని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. నాచుగుంటలో గద్దె రత్నాజీ, వెల్లమిల్లిలో పరిమి సత్యనారాయణ వ్యవసాయ క్షేత్రంలో సమీకృత వరి, చేపలు, ఇతర పండ్ల మొక్కల సాగును సేంద్రియ ఎరువుల ద్వారా చేస్తూ ఆదర్శనీయంగా నిలిచారు. కలెక్టర్ గురువారం నాచుగుంట సందర్శించారు. రైతు రత్నాజీ చేపట్టిన సేంద్రియ సాగు విధానం, మార్కెట్, లాభాలు తదితర అంశాలపై కూలంకుషంగా అడిగి తెలుసుకున్నారు. వరి సాగులో వినూత్న పద్ధతులు అవలంబించి ఒకే పంటకు పరిమితం కాకుండా ఉన్న భూమిలోనే సమీకృత వ్యవసాయ విధానంలో వీలైనన్ని ఎక్కువ పంటలు పండిస్తున్న తీరును రైతు వివరించారు. సుమారు ఎకరన్నర విస్తీర్ణంలో కొంతభాగంలో చేపల సాగు, మిగిలిన భూమిలో వరిని పండిస్తూ ఒకే పంట కాలంలో విభిన్న పంటల దిగుబడి సాధిస్తూ లాభాలు గడిస్తున్న రైతు దూర దృష్టిని కలెక్టర్



చేపలను పరిశీలిస్తున్న కలెక్టర్

అభినందించారు. సేంద్రియ ఎరువుకు ప్రధాన వనరైన దేశవాళీ ఆవును పెంచి దానినుంచి వచ్చే పేడ, మూత్రం ద్వారా కషాయాలు, ఎరువులు తయారు చేసి వాటినే సేంద్రియ ఎరువుగా వినియోగిస్తూ నాణ్యమైన ఆరోగ్యకరమైన పంటలను సాగు చేస్తున్నారు. నాచుగుంటలో రూ.10 లక్షలతో రైస్‌మిల్లులను రైతుకు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. సేంద్రియ పంటల ధాన్యాన్ని బియ్యంగా మర పట్టించేందుకు వీలుగా రైస్‌మిల్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌భాషా, ఎపిసిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు అధికారి బాలిన వెంకటేష్, వ్యవసాయాధికారి డాక్టర్ ఎన్ఎస్.ప్రవీణ్‌కుమార్, తహశీల్దార్ పి.రవికుమార్, ఇఒపిఆర్‌డి చంద్రశేఖరం, పశువైద్యాధికారి పప్పు అశోక్‌కుమార్, వెలుగు ఎపిఎం ప్రభావతి, రైతులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీలుగు విత్తనాలు కావాలి

భూసారం పెంచేందుకు జీలుగు విత్తనాలు కావాలని నాచుగుంటకు చెందిన పలువురు రైతులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై జెడిఎ హబీబ్ భాషా మాట్లాడుతూ జిల్లాకు 10 వేల క్వింటాళ్లు కేటాయించగా, ఇప్పటికి 4800 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయని, వాటిని ఉంగుటూరు మండలానికే కేటాయించినట్లు చెప్పారు. మే నెలాఖరుకల్లా జీలుగు చల్లుకుంటే అదునుగా ఉంటుందని రైతులు చెప్పారు.

పరిశ్రమల మురుగుతో పొలాల ముంపు

ఉంగుటూరులో పలు పరిశ్రమల నుంచి వ్యర్థాల వల్ల వరి పంట దెబ్బతింటోందని చర్యలు తీసుకోవాలని రైతు గద్దె రత్నాజీ కోరారు. వెంటనే పొల్యూషన్ కంట్రోల్ అధికారులను పంపిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

పిజిఆర్ఎస్ అర్జీపై నేరుగా రంగంలోకి కలెక్టర్

ఏలూరు 40వ డివిజన్‌లో పెదపూడి లీలమ్మకు పరామర్శ

సిఎస్ఆర్ నిధులతో 30 రోజుల్లో ఇల్లు నిర్మించి ఇవ్వాలని హౌసింగ్ అధికారులకు ఆదేశం

ఎఎవై కార్డు మంజూరుకు హామీ

ప్రజాశక్తి - ఏలూరు

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీపై స్పందించి నేరుగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి రంగంలోకి దిగారు. అర్జీ అందించిన ఏలూరు 40వ డివిజన్‌కు చెందిన పెదపూడి లీలమ్మ ఇంటికెళ్లి పరామర్శించారు. పూరి గుడిసెలో నివాసముంటున్న ఆమెకు పక్కా ఇంటి నిర్మాణానికి, 30 కిలోల బియ్యం కార్డు మంజూరుకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లీలమ్మ ఇబ్బందులు, ఆరోగ్య వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆమెకు తోడుగా ఉంటున్న పెద్ద కుమార్తెకు టిడ్కో ఇల్లు మంజూరైందని, ప్రస్తుత పరిస్థితి తెలుసుకుని ఇల్లు పూర్తి చేసి ఆమెకు స్వాధీనం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లీలమ్మ వృద్ధాప్య



లీలమ్మతో మాట్లాడుతున్న కలెక్టర్


పరిస్థితి చూసి మానవతా దృక్పథంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా పూరిగుడిసె స్థానంలో 30 రోజుల్లో ఇల్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. 30 కిలోల బియ్యం కార్డు మంజూరుకు కృషి చేస్తామని, వారికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని విధాలుగా ఆదుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ జి.సత్యనారాయణ, నగర పాలక సహాయ కమిషనర్ జి.చంద్రయ్య, తహశీల్దార్ బివి.శేషగిరి, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజాదర్బార్'లో సమస్యల వెల్లువ

రెవెన్యూ అధికారులపై మంత్రి ఆగ్రహం

ప్రజాశక్తి - చాట్రాయి

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ విజయలక్ష్మి అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి హాజరయ్యారు. పలు సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను మంత్రి స్వీకరించారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా మండలంలో భూ సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాలు అవకతవకలు, ఆన్‌లైన్‌లో భూముల నమోదు అవకతవకలపై రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బందిని, విఆర్‌ఒను పలుమార్లు పిలిచినా రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు వస్తేనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మీరు గ్రామాల్లో ఉన్న రైతులకు ఏం పని చేస్తారని హెచ్చరించారు. తహశీల్దారు, రెవెన్యూ సిబ్బంది, అధికారులు మారినా గ్రామాల్లో రైతుల సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయన్నారు. రైతులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగడం మాత్రం తప్పడం లేదన్నారు. ఏళ్ల తరబడి సమస్యలు అలాగే ఉండిపోతున్నాయన్నారు. వెంటనే భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఈశ్వరరావు, ఎంపిడిఒ విజయలక్ష్మి, ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నాయకులు మందపాటి బసవరెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, మరిడి వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న మంత్రి పార్థసారధి

విఒఎల అక్రమ తొలగింపు దుర్మార్గం

విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు వినతి

ప్రజాశక్తి - వేలేరుపాడు

రాజకీయ ఒత్తిళ్లతో లింగపాలెం మండలంలోని 11 మంది విఒఎలను అక్రమంగా తొలగించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు అన్నారు. విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు అధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం లింగపాలెం మండలంలోని విఒఎలకు మద్దతుగా వారికి న్యాయం జరగాలని ఆర్ఐ భుజంగరావుకు వినతిపత్రం అందించారు. సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు మాట్లాడుతూ తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కోర్టు ఉత్తర్వులు ఉన్నా కాని వాటిని బేఖాతారు చేయకుండా, విఒఎలను విధుల్లోకి తీసుకోకుండా వారిని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించి పెండింగ్ వేతనాలు వెంటనే



జంగారెడ్డిగూడెం : వినతి అందిస్తున్న నేతలు

చెల్లించాలన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విఒఎలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ఎపిఎం, సీసీలు, అకౌంటెంట్ నిర్లక్ష్యం వహించడం వల్ల ఒక ప్రాణం పోయిందని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఎపిఎం, సీసీపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు సువ్వేటి లతా, విఒఎలు బొగారి వెంకన్న, మందపాటి శ్రీను, మెండం స్వర్ణలతా పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : లింగపాలెం మండలంలో తొలగించిన 11 మంది విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నేతలు కోరారు. ఈ మరకు జంగారెడ్డిగూడెం తహశీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ లింగపాలెం మండలంలో 11 మంది విఒఎలను అక్రమంగా తొలగించారన్నారు. తొలగించిన 11 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కోర్టు ఉత్తర్వులు అమలు చేయకుండా విఒఎలను తొలగించిన సీసీలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు, విఒఎ మండలాధ్యక్షులు వై.జగదాంబ, కార్యదర్శి బి.ఆదిలక్ష్మి, పి.వరలక్ష్మి, నిర్మల, కృష్ణవేణి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత

రూ.5 కోట్లతో నిర్మించనున్న కృష్ణా-ఏలూరు కాల్వపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. గురువారం ఏలూరు జ్యూట్‌మిల్లు జంక్షన్ సమీపంలో కృష్ణా-ఏలూరు కాలువపై రూ.5 కోట్లతో నిర్మించనున్న నాలుగు వరుసల వంతెన నిర్మాణానికి ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, నగర మేయర్ నూర్జహాన్ పెదబాబుతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా విస్మరించిందన్నారు. కృష్ణా-ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి గతంలోనే నిధులు మంజూరైనప్పటికి ఆ నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. ఈ వంతెన నిర్మాణం భవిష్యత్‌లో ఏలూరు నగరాభివృద్ధికి, ట్రాఫిక్ నియంత్రణకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ వంతెన నిర్మాణాన్ని ఏడాది కాలంలో పూర్తి చేయాల్సి ఉందని, అయితే నాణ్యతతో తొమ్మిది నెలల్లోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. ఏలూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ శాశ్వత పటిష్ట చర్యలకు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పెట్టామని, నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారధి

ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ అందరి సమిష్టి కృషితో వంతెన పనులకు శంకుస్థాపన చేశామని, సకాలంలో వంతెన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ రామకృష్ణ, ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, ఆర్అండ్‌బి ఎస్ఇ ఇ.భరత్‌రత్నం, ఇఇ వైవి.కిషోర్ బాబు, డిఇ గోవింద మోహన్, తహశీల్దార్ జివి.శేషగిరి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు ఆర్ఎన్ఆర్.నాగేశ్వరరావు, దాకారపు రాజేశ్వరరావు, బొద్దాని శ్రీనివాస్, గూడవల్లి వాసు పాల్గొన్నారు.

7 సెంట్లు అని 5 సెంట్లే చూపిస్తారా

పంచాయతీ అధికారుల తీరుపై కలెక్టర్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫిర్యాదు

ఉంగుటూరు : ఏడు సెంట్ల పంచాయతీ స్థలమని చెప్పి మూడేళ్ల కాల వ్యవధికి లీజుకు వేలం పాట నిర్వహించి ఇప్పుడు ఐదు సెంట్ల స్థలం ఉందని పంచాయతీ అధికారులు తనను తప్పుదోవ పట్టిస్తున్నారని నారాయణపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆలపాటి గిరిష్‌కుమార్ జిల్లా కలెక్టరుకు గురువారం నాచుగుంటలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకర్లకు వివరాలను వెల్లడించారు. నారాయణపురం పంచాయతీకి చెందిన సర్వే నెంబర్ 156/2లో జాతీయ రహదారి పక్కన ఏడు సెంట్లు ఉందని ఆ భూమి లీజు కోసం ఏప్రిల్ 19న పంచాయతీ అధికారులు పాలకవర్గం సమక్షంలోనే బహిరంగ వేలం పాట నిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి చంద్రశేఖరం ఆధ్వర్యంలో నారాయణపురం పంచాయతీ కార్యాలయం వద్ద పాట నిర్వహించగా అలపాటి గిరీష్‌కుమార్ రూ. 6.30 లక్షలకు మూడేళ్ల కాల వ్యవధికి పాడుకున్నారు. అప్పటి నుంచి నేటి వరకూ ఏడు సెంట్ల స్థలానికి సరిహద్దులు నిర్ణయించకుండా కాలయాపన చేస్తున్నారని గిరీష్ కుమార్ అన్నారు. ఐదు సెంట్లే స్థలం ఉన్నట్లు బుధవారం సర్వేయర్ కొలతలు వేసి హద్దులు నిర్ణయించారని ఏడు సెంట్లు అని వేలం పాట పెట్టి ఇప్పుడు ఐదు సెంట్లు చూపిస్తున్నారని, అధిక ధరకు పాడానని వాపోయాడు. పంచాయతీ అధికారులు పక్కా రికార్డులు లేకుండా వేలం పాట నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. డిపాజిట్ రూ.50 వేలు చెల్లించానన్నారు. న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి గురువారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారులు పక్కా వివరాలు, సంబంధిత స్థలానికి బౌండరీస్ లేకుండా నిర్లక్ష్యంగా పాట నిర్వహించి తనను తప్పుదోవ పట్టించారని, న్యాయం చేయాలని కోరారు.

ఉన్నత చదువులకు పదో తరగతి తొలిమెట్టు

కలెక్టర్‌చే సప్లిమెంటరీ ప్రత్యేక తరగతుల ఆకస్మిక తనిఖీ

హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్

ప్రజాశక్తి - ఏలూరు

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు అంతా హాజరయ్యేలా, నూటికి నూరుశాతం విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గురువారం స్థానిక ఆదివారపేటలోని ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల కోసం విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 51 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 17 మంది విద్యార్థులు మాత్రమే హాజరు కావడంపై ప్రధానోపాధ్యాయుడిని ఆరా తీశారు. ఈ పాఠశాల నుండి పదో తరగతి పరీక్షలకు 120 మంది విద్యార్థులు హాజరవ్వగా, 69 మంది ఉత్తీర్ణత సాధించారని, 51 మంది ఫెయిలయ్యారని, ప్రత్యేక క్లాసులకు తక్కువ మంది విద్యార్థులు హాజరు కావడంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పనితీరును ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును కాంక్షిస్తూ వారికి మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. ఈ సందర్భంగా హాజరు కాని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కలెక్టర్ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. సప్లిమెంటరీలో కూడా ఉత్తీర్ణత సాధించలేకపోతే ఒక సంవత్సరం కాలం చదువు వృథా అవుతుందని, కేవలం తొమ్మిది రోజులు మాత్రమే సమయం ఉందని, మధ్యాహ్నం నుండి క్లాసులకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజూ క్లాసులకు హాజరై తప్పిన సబ్జెక్టులపై సందేహాలను ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకుని, పూర్తి అవగాహన పెంచుకుని ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. క్లాసుకు అరగంట ముందుగా అందరికీ ఫోన్ చేసి చెప్పాలని, హాజరుకాని విద్యార్థులకు అవసరమైతే రెండుసార్లు అయినా ఫోన్లు చేసి నూటికినూరు శాతం హాజరు అయ్యేలా చర్యలు తీసుకుని, సప్లిమెంటరీ పరీక్షలు నూటికినూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా, నగర అధికారులతోపాటు ప్రధానోపాధ్యాయులు పి.కుటుంబరావు, ఉపాధ్యాయులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్యా ప్రమాణాలతో బోధనే లక్ష్యం


కలిదిండి జెడ్‌పిహెచ్ పాఠశాల గ్రేడ్-2 హెచ్‌ఎం బి.స్వర్ణకుమారి



స్వర్ణకుమారి

ప్రజాశక్తి - కలిదిండి

ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యాభోధన కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకే సాధ్యమని గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు బి.స్వర్ణకుమారి అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో తమ విద్యార్థులు ఎస్ఎస్‌సి 2024 - 25 ఫలితాల్లో ఎన్.హర్షవర్ధిని 600 మార్కులకు 586, ఎం.సాయినాగచందు 576 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. 500 పైగా మార్కులు 24 మంది విద్యార్థులు సాధించారన్నారు. గత రెండేళ్ల నుంచి మండల రికార్డు స్థాయిలో ఎస్ఎస్‌సి ఫలితాల్లో మొదటి స్థానం కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కైవసం చేసుకుందన్నారు. అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్న బోధనా సిబ్బందికి అభినందనలు తెలిపారు. విశాలమైన పాఠశాల భవనాలు, అత్యాధునిక డిజిటల్ ప్రయోగశాల, విశాలమైన ఆట స్థలం, ఆర్ఒ మినరల్ వాటర్ ప్లాంట్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. 1500 పుస్తకాలతో ప్రత్యేక గ్రంథాలయ సౌకర్యం కలదన్నారు. చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. వివిధ ఆటల పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించారన్నారు. ఇన్స్‌ఫైర్ సైన్స్ పోటీల్లో పలు రాష్ట్ర, జాతీయ స్థాయి బహుమతులు పొందారన్నారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. సుదూర ప్రాంత విద్యార్థులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం ఉందన్నారు. అత్యుత్తమ విద్యాబోధనతో అత్యద్భుత ఫలితాలు సాధిస్తున్న కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్చి వారి విద్యోన్నతికి సహకరించాలని కోరారు.



కలిదిండి జెడ్‌పిహెచ్ పాఠశాల

బోధనా రుసుములు చెల్లించనవసరం లేదు

ఎస్ఎంసి ఛైర్మన్ టి.గొల్లయ్య, వైస్ ఛైర్మన్ బి.నాగమణి



గొల్లయ్య



నాగమణి


ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎటువంటి బోధనా రుసుములు చెల్లించనవసరం లేదని ఎస్ఎంసి ఛైర్మన్ టి.గొల్లయ్య, వైస్ ఛైర్మన్ బి.నాగమణి తెలిపారు. ప్రయివేట్ పాఠశాలలకు మించి మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలతో పాటు మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. నోట్ పుస్తకాలు, టెస్ట్ బుక్స్, మూడు జతల యూనిఫాం, షూస్, బెల్ట్ కూడా ఉచితంగా ఇస్తున్నారన్నారు. రుచికరమైన మధ్యాహ్న భోజనంతో పాటు వారానికి ఐదు రోజులు కోడి గుడ్లు, మూడు రోజులు రాగిజావ, మూడు రోజులు చిక్కి విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం అందించే వివిధ పథకాలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. విశాలమైన తరగతి గదులు, అత్యున్నత విద్యార్హతలు, సుదీర్ఘ అనుభవం గల ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతున్నందున కలిదిండిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్చి, తల్లిదండ్రులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా విద్యను పొందే హక్కును సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

CHANGE OF NAME

I, Kollaparthi Venkateswara Rao, S/o. Kollaparthi Lakshmana Swamy, R/o. H.No: 4-137, opp Tata Cell Tower, Khandrikagudem, Eluru, Eluru District, Andhra Pradesh, Pin-534005. I have changed my name from Kollaparthi Venkateswar Rao (Old Name) to **KOLLAPARTHI VENKATESWARA RAO** (New Name). Hence forth I am being called as **KOLLAPARTHI VENKATESWARA RAO** (New Name) for all purposes

ఉంగుటూరు ఎంఎంసి పాలకవర్గం ఇదే

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఛైర్‌పర్సన్ జ్యోతి

ఉంగుటూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన పార్టీ నాయకుడు సూరత్తుల మణికంఠ రాఘవ శ్రీనివాస్ (అయ్యప్ప) భార్య కారేటి జ్యోతిని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ బుధవారం జారీ అయింది. గౌరవ ఛైర్మన్‌గా ఎంఎల్‌ఎ ధర్మరాజు, వైస్ ఛైర్మన్‌గా కూనసాని నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా అచ్యుత విజయభాస్కర సత్యనారాయణ, అల్లుమోలు వెంకటధనయ్య, గాటాల సీతారత్నం, గణసల మహాలక్ష్మి, గౌతు నాగలక్ష్మి, కొత్తపల్లి సింహాచలం, పుప్పాల మద్దిరామమ్మ, తన్నేటి జోగేశ్వరరావు, వడితే అప్పారావు, యాళ్ల కల్యాణి, మీసాల పార్వతీదేవతీ, కొల్లేపల్లి దుర్గావరప్రసాద్, కాళ్ల సంధ్యారాణి, అడవికొలను పిఎసిఎస్ పిఐసి సభ్యుడు, భీమడోలు ఎడిఎ మొత్తం 18 మందితో పాలకవర్గాన్ని నియమించారు.

ముక్కమ్మ సంస్మరణ సభ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీతారాం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ఫ్రాన్సిస్ తల్లి అందుగుల ముక్కమ్మ ఈ నెల నాలుగో తేదీన మృతి చెందారు. బుట్టాయగూడెంలో గురువారం సంస్మరణ సభ నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, మొడియం నాగమణి పాల్గొని సంతాపం తెలిపారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని 27వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆ వార్డు కౌన్సిలర్ నెట్రూ సుబ్బలక్ష్మి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించి పూర్తి చేసినట్లు తెలిపారు. వార్డు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు.

సందడిగా వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు గురువారం 15వ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు చిన్నారులు ఎంతో సందడిగా పాల్గొంటున్నారు. ఉదయం ముందుగా రిసోర్స్ పర్సన్ పి.సంతోషకుమారి విద్యార్థులకు పుస్తక పఠనంలో నీతి కథలు భోధించారు. రిసోర్స్‌పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు (క్రాఫ్ట్ శిక్షణ)లో చిన్న చిన్న మట్టి కుండలతో గృహాలంకరణ, వస్తువుల తయారీలో శిక్షణ అందించారు. విరామ సమయంలో చిన్నారులకు స్నాక్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్‌కుమార్, ఎమ్‌డి అస్లాం పాషా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అపర భగీరధుడు కాటన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అపర భగీరధుడు సర్. అర్థర్ కాటన్ 222వ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో ఇరిగేషన్ ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎన్‌జిఒస్ రాష్ట్ర అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చిలకపాటి దేవప్రకాష్ మాట్లాడుతూ కాటన్ దొర ధవళేశ్వరం వద్ద ఆనకట్టను నిర్మించి ఉభయగోదావరి జిల్లాలను కరువు రహితంగా చేశారని కొనియాడారు. చోడగిరి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్స్ ఫెడరేషన్ కన్వీనర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎన్‌జిఒ సంఘ కార్యదర్శి ఎన్.రామారావు, నోరి శ్రీనివాస్, ఇంజినీర్లు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక సంతోషినగర్ శర్వాని పబ్లిక్ స్కూల్ వద్ద ఎపి జెఎసి అసిస్టెంట్ సెక్రటరీ జనరల్, ఎపిపిఎఒ (వర్క్స్ అకౌంట్స్) ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.హరనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పూడి శ్రీనివాసరావు, తెర్లి జయరాజు, భోగేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్వాధీనం

జంగారెడ్డిగూడెం : మండలంలోని పంగిడిగూడెంలో దాడి చేసి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు తెలిపారు. 200 వందల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి మేడంకి వీర ప్రతాప్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ వారు దేవులపల్లిలో దాడి చేసి మిడత సీత అనే ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా : తప్పిన పెను ప్రమాదం

నూజివీడు టౌన్ : కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. విస్సన్నపేట నుంచి కోడిగుడ్ల లోడుతో లారీ నిడదవోలు వైపు వెళ్తుంది. ఈ క్రమంలో పట్టణంలోని బైపాస్ రోడ్డులో లారీ అదుపుతప్పి పక్కనే ఉన్న ఆటోపై బోల్తా పడింది. ఆ సమయాంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

చంపుతానని బెదిరిస్తున్న వ్యక్తిపై కేసు

టి.నరసాపురం : తన కోరిక తీర్చకపోతే మహిళను చంపుతానని బెదిరిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన పరసా పవన్‌కుమార్ కొంత కాలంగా తన కోరిక తీర్చాలంటూ వెంటపడుతూ ఇబ్బందులకు గురిచేయడంతో పాటు బండిపై ఇంటి చుట్టూ తిరుగుతూ సైగలు చేస్తూ సెల్ ఫోన్ ద్వారా మెసేజ్‌లు పంపేవాడు. విషయం గ్రామ పెద్దల్లో పెట్టి మందలించగా ఫలితంలేదు. అతని బాధ భరించలేక బొర్రంపాలెం గ్రామానికి కాపురం మార్చారు. ఈ నెల 13వ తేదీన భర్త లేని సమయంలో ఇంటికి వెళ్లి తన మాట వినక పోతే చంపేస్తానని బెదిరించడంతో మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని దర్భగూడెం గ్రామంలో పురాతన కాలంలో వేసిన బోరు సక్రమంగా పని చేయక తరచూ నీటి సమస్య వస్తుండటంతో గ్రామస్తులు పలువురు సమస్యను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎంఎల్‌ఎ సొంత నిధుల నుంచి నూతన బోరును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయిలో వెళ్లి నూతన బోరు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో ఎక్కడ కూడా తాగు నీటి సమస్య రానీయకుండా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ బాబు, కూటమి నాయకులు తమ్మన సాంబ, కె.దుర్గారావు, కన్నయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ పోరాటాలకు సిద్ధమవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


రాష్ట్ర ప్రభుత్వం ఎర్రకాలువ ప్రాజెక్టు మిగులు భూములు, ల్యాండ్ సీలింగ్ ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు పార్టీ కార్యకర్తలకు రాజకీయ సైద్ధాంతిక అంశాలు జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకట్రావు అధ్యక్షతన బోధించారు. ఉదయం పార్టీ మండల కార్యదర్శి జీవరత్నం మధ్యాహ్నం పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శిక్షణా తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణా తరగతుల్లో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకరరావు, జి.సూర్యకిరణ్, యాగంటి సీత, వామిశెట్టి నరసరావు, బుద్దుల గంగాభవాని, ఎం.బాలరాజు, ఎం.అశోక్‌కుమార్, కె.సుబ్బారావు, కె.ఏసు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

జంగారెడ్డిగూడెం : ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జంగారెడ్డిగూడెం ఎస్ఐ జబీర్ సూచించారు. జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ద్విచక్రవాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

జులై 9న సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఉంగుటూరులో....

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు కోరారు. ఉంగుటూరులో కార్మిక, కర్షక సంఘాలు, అంగన్వాడీ కార్యకర్తలతో గురువారం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయంలో సమ్మెకు సహకరించాలని కోరుతూ వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సీరా అప్పారావు, నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

పెదవేగి : జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎ.శ్యామలరాణి డిమాండ్ చేశారు. స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద సిఐటియు మండల కమిటీ సమావేశం పి.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామలరాణి మాట్లాడారు. జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు బైగాన్ని రమేష్, టి.ఆంజనేయులు, బి.రోజా, ఎ.వల్లి, ఎన్.తులసి, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

నిడమర్రు : ఉపాధి హామీ కూలీలు పనిచేసే ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గవర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎపిఒకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జులై 9న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉపాధి హామీ పనులు బంద్ చేయాలన్నారు.

టి.నర్సాపురం : లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జులై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం, సిఐటియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు అనుమోలు మురళి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో అన్ని తరగతుల కార్మికులు, సామాన్య ప్రజానీకం అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ జ్యోతి, ఎన్.విజయ, వనిత పాల్గొన్నారు.

సమావేశాలు సమస్యల పరిష్కారానికి కాదా..!

అధికారుల గైర్హాజరు సరికాదు

మున్సిపల్ సాధారణ సమావేశంలో టిడిపి ఫ్లోర్ లీడర్, వైస్ ఛైర్మన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

మున్సిపల్ సాధారణ సమావేశానికి అధికారుల గైర్హాజరు సరికాదని టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, వైస్ ఛైర్మన్ సత్యనారాయణ అన్నారు. సమావేశాలు సమస్యల పరిష్కారానికి కాదా అని ప్రశ్నించారు. నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన గురువారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ ఏ సమస్యపై చర్చించాలన్న ఆ శాఖకు చెందిన అధికారులు కనిపించడం లేదని వాపోయారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలు కూడా పాటించరా అని ప్రశ్నించారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో కల్వర్టులు ఎంతో ఇరుకుగా ఉన్నాయని, వాటిని వెడల్పు చేసేందుకు ప్రతిపాదించాలన్న సంబంధిత శాఖ సిబ్బంది పాల్గొనకపోవడం సరికాదని చెప్పారు. వేసవి దాహార్తిని తీర్చేందుకు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ట్యాంకర్‌ను అందించడంతో పట్టణంలో మూడు ట్యాంకర్లు ఉన్నాయని, ఒక్క ట్యాంకర్‌తో మాత్రమే నీటిని ఎలా సరఫరా చేస్తారని ప్రశ్నించారు. ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇచ్చే ఆశయంతో కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని, ఆ వివరాల కోసం చూస్తే... అధికారులు లేరన్నారు. పలు అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానించారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కొల్లేరు పరిరక్షణకు కృషి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చేపట్టిన లిడార్ సర్వే ఆధారంగా కొల్లేరులో అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. కొల్లేరు సరస్సు పరిరక్షణపై, సరస్సు పరిసరాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాల తొలగింపు చర్యలపై జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుత కొల్లేరు సరస్సు పరిరక్షణకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా లిడార్ సర్వే కొనసాగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా సరస్సు అసలు పరిమితి, ఆక్రమణ స్థలాలు, మానవీయ జోక్యాల కారణంగా ఏర్పడిన మార్పులు కచ్చితంగా గుర్తించ నున్నట్లు తెలిపారు. కొల్లేరు సరస్సు మన రాష్ట్రానికి పర్యావరణంగా, జల సంరక్షణ పరంగా ఎంతో ముఖ్యమైందన్నారు. అక్రమ ఆక్రమణల వల్ల ఈ సరస్సు వైవిధ్యం కోల్పోతోందని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చేపట్టిన లిడార్ సర్వే ఆధారంగా అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు వేగవంతం చేయాలని చెప్పారు. అటవీ శాఖాధికారులు, డ్రెయిన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు వారి శాఖల ద్వారా చేపట్టిన ముందస్తు చర్యల గురించి వివరించారు. అక్రమ చేపల చెరువులు, మట్టి పూడికల తొలగింపునకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొల్లేరులో 67 మినీ డ్రెయిన్ చానల్స్ ఉన్నాయని, ముంపు బారిన పడకుండా వాటి పూడికతీత పనుల ప్రతిపాదనలు తయారు చేసి అటవీశాఖ ద్వారా ప్రభుత్వ అనుమతి కోసం పంపాలని తెలిపారు. సదరు ప్రతిపాదనలు తయారుచేసిన అనంతరం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సహకారంతో ప్రభుత్వ అనుమతి పొందేలా కృషి చేస్తామని ఛైర్‌పర్సన్ తెలిపారు.. ఈ సమావేశంలో డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ బి.విజయ, డ్రెయిన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

చింతలపూడి : మండలంలోని ఎర్రంపల్లి గ్రామంలో ఉన్న లోకల్ ట్రైనింగ్ సెంటర్ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వర్మీ తయారు చేయడం బాగుందని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.ప్రసంగరాజు అన్నారు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను బాగా వేరు చేస్తున్నారన్నారు. క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి, డిప్యూటీ ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా వీడి సగర్వంగా జీవించండి

నూజివీడు టౌన్ : సారాను విడనాడి సమాజంలో సగౌరవంగా జీవించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆవులయ్య అన్నారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో నవోదయం 2.0పై గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీ, క్రయ, విక్రయాలు చట్ట విరుద్ధమన్నారు. ప్రభుత్వం సారాపై ఉక్కు పాదం మోపుతోందని తెలిపారు. అందులో భాగంగా నవోదయం, నవోదయం 2.0 అనే కార్యక్రమాల ద్వారా విస్తృతమైన దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల ఫలితంగా వందలాది గ్రామాలు సారాను విడనాడి సమాజంలో జీవించేందుకు జనజీవన స్రవంతిలో కలుస్తున్నట్లు సోదాహరణంగా వివరించారు. అలాంటి వారికి ప్రత్యామ్నాయ దిశగా ఉపాధి కల్పించేందుకు అనేక పథకాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

కుక్కునూరు : మండలంలోని వింజరం పంచాయతీ పరిధిలో బర్లమడుగు గ్రామంలో ఈ నెల 11వ తేదీన పొలాల వద్ద రైతులు వ్యర్థాలు తగలబెడుతున్న సమయంలో గాలికి నిప్పు రవ్వలు లేచి దగ్గర్లో ఉన్న సోయం బుల్లెమ్మా, రేసురాజులు అనే ఇద్దరి పూరి గుడిసెలపై పడి మంటలు అంటుకుని దగ్ధమ య్యాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఇంట్లోని నగదు, వస్తువులు, పలు డాక్యుమెంట్లు దగ్ధమయ్యాయి. జనసేన మండలాధ్యక్షులు ములిశెట్టి యుగంధర్ బాధితులను గురువారం పరామర్శించి వారికి రూ.పది వేల ఆర్థిక సాయం, బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు అందించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గుర్తింపు కార్డు, తదితర కార్డులు పూర్తిగా దగ్ధమయ్యాయని చెప్పారు. అధికారులుతో మాట్లాడి తక్షణమే డాకుమెంట్స్ నకలు ఇప్పిస్తానని యుగంధర్ వారికి చెప్పారు. సమస్యను ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు దృష్టికి తీసుకెళ్లానని, ఆయన స్పందించి నూతన గృహాలు మంజూరు చేయిస్తానన్నారని తెలిపారు.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి మరియు మోటారు ఆక్సిడెంట్లు క్లైమ్స్ (మహిళా కోర్టు), ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా.

M.V.O.P.No.36/2025

కుమారి మద్దుకూరి రమ్య ...పిటీషనరు

మరియు

1. తాడికొండ మనోహర్ సందీప్
2. డి.హెచ్.డి.యఫ్.సి.జనరల్ ఇన్స్యూరెన్సు

...రెస్పాండెంట్లు

పత్రికా ముఖంగా పైకోర్టు వారి ఆదేశాను సారంగా కుమారి మద్దుకూరి రమ్య పై కోర్టు వారి ఎదుట తనకు మోటారు యాక్సిడెంటుకు నష్టమునకు పరిహారం కోరుతూ పైన తెల్పిన వారి పైన పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పైన తెల్పిన 1వ ప్రతివాది తాడికొండ మనోహర సందీప్ గారి దావా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుట వలన పై కోర్టు వారు **ది.6-5-2025న** పత్రికా ముఖంగా నోటీసు యిచ్చుటకు గాను ఉత్తర్వులు యిచ్చినందున సదరు 1వ ప్రతివాది మనోహర్ సందీప్ గార్కి తెలియచేయునది ఏమనగా పైదావా గ్రంథం పై కోర్టు వారి ఎదుట హాజరు నిమిత్తం **ది.20-6-2025**కు వాయిదా అయివున్నందున మీరు ఆరోజు అనగా ది.**20-6-2025** ఉదయం గం.10.30 ని॥లకు స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరు కావలసినదిగా కోరడమైనది. లేని యెడల సదరు దావా గ్రంథం మీ పరోక్షంలో పరిష్కరించబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.

ఎన్.కృష్ణమూర్తి

ఏలూరు, పిటీషనరు తరపు న్యాయవాది

తేది.07-5-2025 అశోకనగర్,ఏలూరు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.48/2024 in O.S.No.41/2017

Between:

కుసుమే వెంకటేశ్వరరావు ...పిటీషనరు/డిక్రీ హోల్డర్

And

బర్రె నందిరాజు ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డెబ్టార్

To.

బర్రె నందిరాజు, తండ్రి సుబ్బారావు, వయస్సు 55 సం॥లు, పురుషుడు, వ్యాపారం, డోర్‌నెం.34-25, వెన్నపువారిపాలెం, H/o.ఆచంట, ఆచంట మండలం.

పై నెంబరు వారంటు అమలు గ్రంథములో జడ్జిమెంట్ డెబ్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని **ది.16-6-2025వ తేదీన ఉ.గం.10.30 ని.ల** లగాయితు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసినవారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూల్

West Godavari District, Achanta Sub Registrar area, Achanta Mandal, Achanta Gram Panchayat area, Achanta Village.

Item No.1: In R.S.No.946/2, Zeroyath Wet Land to an extant of Ac.0.32 Cents with in following boundaries.

East : Land belongs to Bokka Raghavulu
South: Land belongs to Vennapu Babu Rao
West : Property belongs to Bokka Chandrakala
North: Property belongs to Barre People.
D.H.R Value : Rs.3,00,000/-
Amin Value : Rs.10,00,000/-

Item No.2: In R.S.No.919/13, Zeroyath Wet Land to an extant of Ac.0.09 Cents & in R.S.No.919/17 Zeroyath wet land to an extant of Ac.0.07 Cents in total to an extant of Ac.0.16 Cents consisting as a single plot with in following boundaries.

East: Land belongs to Pathagolusu Ramudu, South : Land belongs to Barre People & Matta Manikyam, West : Property belongs to Tarivitala Kattlayya. North: Property belongs to Vennapu Mohana Rao.

With all easementary rights.
D.H.R. Value : Rs.1,00,000/-
Amin Value : Rs.5,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పాలకొల్లు **మేడపాటి వెంకట రామారెడ్డి**
13-05-2025 న్యాయవాది,
పాలకొల్లు, ప.గో.జిల్లా.

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.2/2020 in O.S.No.30/2016

Between:

బురాబత్తుల వెంకటరెడ్డి (Died) వగైరా ...పిటీషనరు/డిక్రీ హోల్డర్

And

పాలా అంజమ్మ @ పార్వతి వగైరా ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డెబ్టార్స్

To.

1. పాలా అంజమ్మ @ పార్వతి, భర్త వెంకటరావు, వయస్సు 55 సం॥లు, గృహిణి, డోర్‌నెం.10-109/1, అంబటి వాని చెరువు, H/o.పోడూరు, పోడూరు మండలం.
2. పాలా శ్రీనివాసరావు, తండ్రి వెంకటరావు, వయస్సు 42 సం॥లు, వ్యాపారం, డోర్‌నెం.10-109/1, అంబటి వాని చెరువు, H/o.పోడూరు, పోడూరు మండలం.
3. బురాబత్తుల లక్ష్మి, భర్త శ్రీనివాసరావు, వయస్సు 22 సం॥లు, డోర్‌నెం.1-54, పెంకుళ్ళపాలెం, కవిటం, పోడూరు మండలం.
4. పాలా ఇందిర, తండ్రి వెంకటరావు, వయస్సు 20 సం॥లు, డోర్‌నెం.10-109/1, అంబటి వాని చెరువు, H/o.పోడూరు, పోడూరు మండలం.

పై నెంబరు వారంటు అమలు గ్రంథములో జడ్జిమెంట్ డెబ్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని **ది.18-6-2025వ తేదీన ఉ.గం.10.30 ని.ల** లగాయితు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసినవారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూల్

West Godavari District, Palakol Sub Registration District, Poduru Mandal, Penumadam Village, an extent of Ac.0.30 cents of land in R.S.No.126/1A/6A of Penumadam Village with in following boundaries.

East : Land of Balam Rameswaram
West : Land of Kukkala Venkata Reddy
South : Land of Tannadi Gani Raju
North: Land of Kukkala Venkata Reddy
With all easementary rights.
Amin Value : Rs.15,00,000/-
D.H.R. Value : Rs.8,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పాలకొల్లు **మేడపాటి వెంకట రామారెడ్డి**
13-05-2025 న్యాయవాది,
పాలకొల్లు, ప.గో.జిల్లా.

TADEPALLIGUDEM MUNICIPALITY

E-PROCUREMENT TENDER NOTICE

Roc.No.2422/E1/2023-24 **Dated.15/05/2025**

Sl. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Reciept of Bids
1.	Providing new Culverts in 25th Ward Primary School, Operation & Maintenance of AMRUT & TIDCO Pumping Stations at HWW and Providing Yard Lighting in TPG Mpl.Office Premises-3, Works-3	General	13.61	16/05/2025	30/05/2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site https://tender.apeprocurement.gov.in.

Sd/- Commissioner
Tadepalligudem Municipality.